ఆడవాళ్లు
ఆడేబేరానికి
షాపువాళ్ల
విట్స్!

# బేరం

జి. రఘుపతి రావు కథ

"పెళ్లిరోజుకు మంచి పట్టుచీర కొనుక్కోవాలండీ" అంది వారిజ భర్త మధుకర్‌తో.

చాలామంది భర్తలకు అలాంటి 'డిమాండ్' మేకింగ్ న్యూసేమో కాని అతను అమెలో బాగా అలవాటుపడిపోయాడు. ప్రతి ముఖ్య సందర్భాలను వారిజ చక్కని చీరకొని 'సెలబ్రేట్' చేసుకుంటుంది. అలాంటిది 'మారేజ్ డే'కి కాకపోతే ఎలా?

'అలాగే! కాని 'పట్టు' చీరకోసం పట్టుబట్టనని మాట యివ్వాలి ప్లీజ్' రిక్వెస్ట్ చేశాడు మధు.

"మీరేం భయపడాల్సిన పనిలేదు. ఖరీదైన చీరకొననని మాట యిస్తున్నాను. రెండు వేల కంటే ఎక్కువ ధర పెట్టను. నేను 'బేరమాడి' మరీ కొంటాను. పదిహేను వందలకే రాబడతాను. ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో తీస్తాను. ప్రస్తుతానికి ఐదొందలిస్తే చాలు!" తన తెలివినంతా వుపయోగించి చెప్పింది భర్తతో.

"ఓయ్! వారిజగారూ! రెండువేల శారీ పదిహేను వందలకా? అదీ వాయిదాల్లోనా? ఏ తలమాసిన షాపు వాడిస్తాడు అంత బెనిఫిట్?" ఉడికించాడు మధు.

"ఏ షాపువాడు తలమాసిన వాడు కానక్కరలేదు. నా తెలివితేటలు ఉపయోగించి మరీ కొంటాను. అసలు శారీ మీద 2000 వ్రాసి వుందనుకోండి, కేవలం వెయ్యి రూపాయలకే అడుగుతాను. వాడు పదిహేనువందలకైనా యిస్తాడు. అదీ నా బార్గెయినింగ్ కెపాసిటీ!" అంది స్థయిర్యంగా.




'గుడ్! అలాగే, ప్రొసీడ్!' ఉడికించాడు మధుకర్.

* * *

జనవరి వెలేమో ప్రతీ గవర్నమెంటు ఉద్యోగికే చేతుల్లో పైసా ఆడే సమయం. పండగ అడ్వాన్సు, మెడికల్ రీయింబర్సుమెంటు ల్లాంటివి చేతిలో రాలతాయి. వారిజ తమ పెళ్లి రోజు ఘనంగా జరుపుకుందా

మంటే తనకూ యిష్టమే! అయినా ఇది తను వివాహమయింతర్వాత రాబోయే రెండో పెళ్లిరోజు! షాపింగ్ చేద్దామని తను అవసరమైన డబ్బు డ్రా చేశాడు. పెందలాడే ఆఫీసు వదిలి త్వరగా యిల్లు చేరుకున్నాడు. అంత త్వరగా యిల్లు చేరిన భర్తను చూసి ఆశ్చర్యం నటిస్తూ అంది వారిజ.

"ఏమి నా అదృష్టం. మీరు తొందరగా వచ్చారు. కాని షాపింగ్ మీతో కల్సి చేయాలనుకోవటం లేదు నేను!"

"ఏమిటట, పాపం!" కవ్వించాడు మధు.

"మీ మగవాళ్లతో షాపింగ్ చేస్తే బోలెడు నష్టపోవాలి!" అంది.

"అంటే?" రెట్టించాడు మధు.

"ఏముందీ, మిమ్మల్ని చూసి షాపువాడు రూపాయి వస్తువు మూడు రూపాయలు చెప్తాడు. మాట్లాడకుండా వాడు చెప్పిన ధర చెల్లించి వచ్చెయ్యటమేగా మీరు చేసేది!"

"ఔరా! అంటే మగవాళ్లు ఏమీ తెలియని అమాయకులు, మీరు తెలివైన వారూనా?–!"

"కాదండీ! మీరు బేరమాడరు. అదే మేమయితేనా, వాడికి పుటం వేసి మరీ తగ్గించి కొంటాం. తెల్సిందా?"

"సరేబాబూ! మీకు అంతటి ప్రతిభ వుందని ఒప్పుకుంటున్నాను. నీవు అడిగినట్లు అయిదు వందలివిగో! నీవేపోయి చీరతెచ్చుకో! అన్నట్లు నా కిష్టమైన 'బాకీవావ్' పిక్చరొచ్చింది, 'జెమిని'లో. నీవు షాపింగ్ పూర్తి చేసుకొని వచ్చేప్పటికి యింట్లో వుంటాను" అన్నాడు.

"అంటే, తొమ్మిది గంటలదాకా నాకే చీర బేరమాడుతూ వుంటావనేగా మీ వుద్దేశం?" అంది మూతి ముడిచి.

"కాదోయ్, ఇంగ్లీషు సినిమాకదా, నేనే ముందొస్తానని నా అభిప్రాయం".

ఇద్దరూ నవ్వులో శృతి కలిపారు.

వారిజ తనను దగ్గరికి తీసుకొని ముద్దు చెల్లిస్తున్న మధుకర్ పెదాలను వొద్దన్నట్లుగా వారించింది.

* * *

అనుకున్నదానికి కొంచెం భిన్నంగా అరగంట ముందుగానే చీర పాక్ చేయించుకొని వచ్చింది వారిజ. యింట్లో అప్పటికే మధుకర్ వచ్చి భార్య రాకకోసం ఎదురు చూస్తున్నాడు. స్ప్రేట్‌గా సన్నజాజుల పరిమళం గదిలో వ్యాపించేసరికి పత్రిక చూస్తున్న మధుకర్ వారిజ రాకను గుర్తించేడు. పాకెట్ మధుకు అందిస్తూ "చూశారా! నిన్న మీతో చెప్పిన షెడ్యూలుకు ఆవంతయినా తేడాలేని విధంగా చీర బార్గెయిన్ చేసి ఇన్‌స్టాల్‌మెంటులో కొని తీసుకు వచ్చాను. ఇప్పటికైనా ఒప్పుకుంటారా, వస్తువు కొనటంలో ఆడవారికున్న ప్రతిభ?" కొంటెగా అంది.

"ఆహా! నాకా విషయంలో ఎలాంటి సందేహము లేదు. నీకో విషయం చెప్పాలి. నీవు అన్నట్లుగా వాయిదాల్లో కాదు, షాపువాడి కివ్వవలసిన మిగతా వెయ్యి రూపాయలు ఇచ్చేద్దాం. ఫెస్టివల్ అడ్వాన్సు గ్రాటా తీసుకున్నాం కదా! బాకీ ఎందుకు?" అన్నాడు మధుకర్.

'ఆల్‌రైట్. నా కభ్యంతర మేమీ

లేదనుకోండి. కానీ వాడికి చెల్లించాల్సిన వాయిదా వచ్చే నెల్లో కదా, ఇంత ముందుగా ఎందుకని!'' అంది.

వచ్చే నెలలో చెల్లించాల్సిన వాయిదా వడ్డీతో వసూలు చేయకుండా వుంటాడా, దుకాణదారు? ఈ మాట బయటికి అనకుండా, ''అప్పులంటే చిరాకు, వారూ! డబ్బు ఉంచుకొని క్రెడిట్ ఎందుకు? నువ్వే చెప్పు!'' చుబుకం పైకెత్తి అన్నాడు. శ్రీవారు అంతగా చెబుతుంటే కాదనలేని వారిజ 'సరే'!'' అంది.

* * *

''నమస్తే సార్'' అన్నాడు షాపువాడు, షాపులో ప్రవేశించే ముందు 'షూస్' బయట వదుల్తున్న మధుకర్‌ని చూసి.

''నమస్కారం! నిన్న మా ఆవిడ కొన్న చీర బాపతు చెల్లించాల్సిన మిగతా పైకం ఇచ్చి వెళ్దామని వచ్చానండీ'' అన్నాడు మధు.

''ఎంతమాట సార్! మేమేమయినా అడిగామా? ఇంకా రెండు వాయిదాలున్నాయి గదండీ. అమ్మగారు ఆ కండిషన్ మీదే 'పట్టుచీర' తీశారు!'' అన్నాడు.

''మీ పద్ధతేమీ బాలేదండీ! ఆడవాళ్లు వస్తేనే తగ్గిస్తారు. ఇదో మేమొస్తేచూడండి ధర వసాళానికంటిస్తారు!'' ''మీ వరస నాకర్థం కావడం లేదు బాబూ!'' అభియోగం మోపాడు మధుకర్.

''చూడండి మధుకర్ గారూ! మీరీ విధంగా 'చిరునింద' మాపై మోపారు కాబట్టి వ్యాపార రహస్యం చెప్పక తప్పటం లేదు. మీరొచ్చినా లేక మీ శ్రీమతిగారొచ్చినా మేం అమ్మే ధరలో ఎలాంటి తేడా రాదు. సరికదా మీరు వస్తే మీకు బేరం తొందరగా ముగుస్తుందీ, మీరు త్వరగా ఇంటికెళ్లగలుగుతారు. ఆడవారు వచ్చేరనుకోండి, వారు బేరం చేసే మార్జిన్ కలుపుకొని ముందే ధర ఎక్కువగా చెప్పి తగ్గించడం జరుగుతుంది. ఇదిగో చీరమీద ధర అంటించిన స్టిక్కరుంది చూశారూ? మీరు షాపింగ్‌కు వస్తే కొంత శాతం తగ్గించి అమ్ముతాము. మీ శ్రీమతి లాంటివారు వచ్చారనుకోండి. ఇదే రియల్ ప్రైస్ గా చెప్పి తగ్గించగలిగిన శాతం తగ్గించి వారి 'ఈగో' శాంతింపజేయటం జరుగుతుంది'' అన్నాడు షాపు యజమాని.

చెల్లించవలసిన రెండు వాయిదాల సొమ్ము చెల్లించి షాపు నుండి బయటకు నడిచాడు మధుకర్, చిరునవ్వులో కూనిరాగం తీసుకుంటూ!

*

